న్యూస్ బాక్స్

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లోని లబ్ధిదారు లలితకు మంజూరైన రూ.20 వేల విలువ చేసే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం అందజేశారు. పేదల వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

నూతన కార్యవర్గం

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టీజీపేట రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవమైంది. శుక్రవారం సిరిసిల్ల పట్టణం మున్నూరు కాపు సంఘం కల్యాణ మండపంలో టీజీపేట జిల్లా సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా దుప్పటి రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా నాంపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎస్.రాజు, దాని నరేష్, సంధ్యారాణి, కార్యదర్శులుగా బి.పర్శరాములు, ఎల్.రమేష్, ఎం.దీపారాణి, కోశాధికారిగా తడకల శ్యాంసుందర్, సంయుక్త కార్యదర్శులుగా ఎ. రాజశేఖర్, కె.రజితారెడ్డి, జి.రాధారాణి ఎన్నికయ్యారు.

'గోరుముద్ద' ప్రారంభం

కోనరావుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కొలనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు గోరుముద్ద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు స్రవంతి, వీరబోయిన తిరుపతి, కాదాసు రాములు, హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గ్రూప్ 2 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఆది, సోమవారాల్లో పరీక్ష
- జిల్లాలో 26 కేంద్రాలు
- 7,163 మంది అభ్యర్థులు
- టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల హాల్‌టికెట్లు
- పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందబోస్తు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్-2 పరీక్షకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 15, 16 తేదీల్లో (ఆది, సోమవారాల్లో) నాలుగు దఫాలుగా పరీక్ష కొనసాగనుంది. ఇందులో భాగంగా అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. జిల్లాలో గ్రూప్-2 పరీక్ష కోసం 26 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 7163 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఇందులో 106 మంది దివ్యాంగ అభ్యర్థులు ఉన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థుల కోసం ప్రధాన కూడళ్ల వద్ద హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు. సమాచారం కోసం హెల్ప్‌డెస్క్ సెల్ నంబర్లను అందుబాటులో ఉంచారు. పరీక్షల నిర్వహణలో 26 మంది అబ్జర్వర్స్, 26 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 26 మంది సూపరింటెండెంట్‌లు, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో పర్యవేక్షించనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద బయోమెట్రిక్, ఐడెంటిఫికేషన్ అధికారులను నియమించారు.

జిల్లాలో పరీక్ష కేంద్రాలు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రూప్-2 పరీక్ష 26 కేంద్రాలు ఏర్పాటు చేశారు. తంగళ్లపల్లిలో జడ్పీ ఉన్నత పాఠశాల, శ్రీసరస్వతి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల, సిరిసిల్లలో సెస్ మిగతా 8వ పేజీలో..

30 నిమిషాల ముందే పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేత

జిల్లాలో ఆది, సోమవారాల్లో నిర్వహించనున్న గ్రూప్ - 2 పరీక్షకు 30 నిమిషాల ముందే గేట్లను మూసివేయనున్నారు. మొదటి పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, రెండో పరీక్ష మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు కొనసాగనుంది. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే గేట్లు మూసివేయనున్నారు. ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు పరీక్ష కేంద్రం గేటు ముగిసిన తరువాత ఎవరినీ అనుమతించరు. అరగంట ముందే గేట్లు మూసివేస్తారు. నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను అనుమతించరు. బయోమెట్రిక్ విధానం కూడా ఉండడంతో అభ్యర్థులు ముందే రావడం మంచిది. అభ్యర్థులు తమ వెంట హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా ఒక ఒరిజినల్ గుర్తింపు కార్డు తెచ్చుకోవాలి. బయో మెట్రిక్ వేలి ముద్ర హాజరు ఉండడంతో మెహందీ, టాటూలు వేసుకోవద్దు. పరీక్ష ముగిసిన తరువాత ఓఎంఆర్ షీట్‌ను ఇన్విజిలేటర్‌కు అందించి నామినల్ రోల్‌పై వేలి ముద్రలు వేయాల్సి ఉంటుంది.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్
- నాలుగో రోజుకు రిలేదీక్షలు



7 మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- స్వామివారికి కోడె మొక్కు చెల్లింపు
- అనుబంధ ఆలయాల్లో పూజలు



7 ఆలయ ఆవరణలో భక్తులు

ఆడ పిల్లలపై అఘాయిత్యాలను అరికట్టాలి



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు, అధికారులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆడ పిల్లలపై అఘాత్యాలను అరికట్టేందుకు మహిళా సంఘం సభ్యులు కృషి చేయాలని ఐకేపీ ఏపీఎం మల్లేశం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మల్లేశం మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఉపాధిహామీ పథకం కింద చేపట్టనున్న పండ్ల తోటలు, గొర్రెలు, కోళ్ల, గేదెల పెంపకంపై ఈజీఎస్ ఏపీవో కొమురయ్య అవగాహన కల్పించారు. అనంతరం మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మల్లేశం, ఏపీవో కొమురయ్య, గ్రామైక్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో ధరల పట్టిక బోర్డు ఏర్పాటు



పీఆర్వో కార్యాలయం వద్ద నిత్యపూజల ధరల పట్టిక బోర్డు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సమాచార కోసం నిత్యపూజల బోర్డును ఏర్పాటు చేశారు. నవంబరు 6వ తేదీన 'రాజన్న ఆలయంలో మారని ధరల పట్టిక' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆలయాధికారులు రాజన్న ఆలయంలో ప్రధాన బుకింక్ కౌంటర్, పీఆర్వో కార్యాలయంతోపాటు ఆలయ పరిసరాల్లోని పలు ప్రాంతాల్లో భక్తులకు నిత్య పూజల వివరాలు తెలిసేలా బోర్డులను ఏర్పాటు చేశారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- 610 కేసుల పరిష్కారమే లక్ష్యం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని, సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికా సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత తెలిపారు. శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడలో ప్రతీ కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్ నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో 2558 కాంపౌండెబుల్ క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఇందులో 610కేసుల పరిష్కారమే లక్ష్యంగా నిర్ణయించామని అన్నారు. ఈ లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులు, రాజీపడదగిన క్రిమినల్ కేసులు, మోటారు ప్రమాద పరిహార కేసుల పరిష్కారానికి అవకాశం ఉందన్నారు. లోక్ అదాలత్‌లో ఇరు పార్టీలకు ఆమోద యోగ్యమైన ఖర్చు, కాలయాపన లేకుండా, అప్పీలు లేని అంతిమ తీర్పును పొందడానికి వీలుందన్నారు. కక్షిదారులు, ప్రజలు న్యాయసేవాధికార సంస్థను సంప్రదించి కేసులను సత్వరమే పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ సేవలు పూర్తిగా ఉచితమని, నేరుగా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని అన్నారు. టోల్ ఫ్రీ నంబరు 15100 ద్వారా పూర్తి వివరాలను పొందవచ్చన్నారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ పాల్గొన్నారు.

నేడు కామన్ డైట్ కార్యక్రమం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్ ఆశ్రమ పాఠశాలల్లో శనివారం నిర్వహించనున్న కామన్ డైట్ మెనూ అమలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పిలుపునిచ్చారు. కామన్ డైట్ మెనూ అమలుపై ఆయా విద్యాలయాల బాధ్యులు, ఇన్‌చార్జిలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి శనివారం అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కామన్ డైట్ ప్లాన్‌పై విస్తృత ప్రచారం కల్పించాలని, పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించాలని సూచించారు. హాస్టల్స్‌లో కామన్ డైట్ వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతీ హాస్టల్‌లో ఒకే రకమైన ఆహారం విద్యార్థులకు అందించనున్నట్లు చెప్పారు. కిచెన్, డైనింగ్ ఏరియా నిర్వహణ మెరుగు పరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు వీఐపీ రెసిడెన్షియల్ పాఠశాలలకు చేరుకుంటారని, 11 నుంచి 12గంటల వరకు పాఠశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తారని పేర్కొన్నారు. 12 నుంచి 12.30 గంటల వరకు పిల్లలతో ఇంటరాక్షన్, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం కామన్ డైట్ ప్లాన్ సంబంధించిన హాండ్ బుక్ ఆవిష్కరణ ఉంటాయని తెలిపారు.

మానాలలో హాజరుకానున్న విప్

రుద్రంగి మండలం మానాలలోని టీజీ టీడబ్ల్యూఆర్ఎస్ (బాలికల) విద్యాలయంలో చేపట్టే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరుకానున్నారు. తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలోని విద్యాలయంలో చేపట్టనున్న కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ దుమాల ఎల్లారెడ్డిపేటలో చేపట్టనున్న కార్యక్రమానికి ఎస్పీ అఖిల్ మహాజన్, టీజీఎస్ డబ్ల్యూ ఆర్ఎస్ (బాలికలు) చిన్న బోనాలలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆయా విద్యాలయాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఆర్డీవోలు, ఆయా శాఖల జిల్లా అధికారులు హాజరుకానున్నారు.

తీరనున్న కష్టాలు

- కల్వర్టులు, రహదారుల నిర్మాణానికి నిధులు
- మంజూరుపై మండల ప్రజల హర్షం



కొలనూరు, రామన్నపేట మధ్యలో కూలిన కల్వర్టు

కోనరావుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన కల్వర్టు, రహదారులు వర్షాలకు దెబ్బతిని మండల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం కల్వర్టులు, రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. దీంతో మండల వాసులకు కష్టాలు తీరనున్నాయి. గత ప్రభుత్వానికి ప్రజలు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. కూలిన కల్వర్టు దెబ్బతిన్న రహదారుల నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు మంజూరు చేసింది. దీంతో మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోనరావుపేట మండలం సుద్దాల ఎక్స్ రోడ్డు నుంచి మంగళపల్లె వరకు తారు రోడ్డు లేకపోవడంతో 15 సంవత్సరాలుగా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రధాన రహదారి నిర్మాణానికి ఒక కోటి 30 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ తారు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అధికారులు ఇటీవల భూమి పూజ చేశారు. కొలనూరు నుంచి రామన్నపేట గ్రామానికి వెళ్లే లోలెవల్ బ్రిడ్జి వరద తాకిడికి కూలిపోయింది. దీని నిర్మాణానికి రూ.కోటి 70 లక్షలు మంజూరు చేశారు. మల్కపేట రిజర్వాయర్ ప్రాంతంలోని పొట్టి గుట్టపైన నిర్మించిన రామాలయానికి వెళ్లేందుకు సీసీ రోడ్డు నిర్మాణానికి సుమారు కోటి రూపాయలు మంజూరవగా భూమి పూజ కూడా చేశారు. త్వరలోనే పనులు ప్రారంభించినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. పనులు పూర్తయితే మండలవాసుల కష్టాలు తీరనున్నాయి.



గుంతలమయంగా మారిన రహదారి

త్వరలో డ్రైవింగ్ లైసెన్స్ మేళా

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్ధేశిత ఆన్‌లైన్ రుసుముతో త్వరలో ద్విచక్రవాహన డ్రైవింగ్ లైసెన్స్ మేళా నిర్వహించన్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని 18 సంవత్సరాలు నిండిన యువత ఈ నెల 19న సాయంత్రం 5గంటలలోగా పదోతరగతి మెమో, ఆధార్ కార్డుతో సంబంధిత పోలీస్‌స్టేషన్లలో పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పేర్లు నమోదు చేసుకున్న వారికి డ్రైవింగ్ టెస్టులు నిర్వహించనున్నట్లు, అర్హత సాధించిన వారికి లైసెన్స్‌లు జారీ చేయనున్నట్లు తెలిపారు.

నేడు రంగినేని ట్రస్టులో పురస్కార ప్రదానోత్సవం

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు శివారు రంగినేని చారిటబుల్ ట్రస్టులో శనివారం రంగినేని (రేగులపాటి) లక్ష్మీ బాల వికాస పురస్కార ప్రదానోత్సవం నిర్వహించన్నట్లు పిల్లల పండుగ కన్వీనర్ గరిపెల్లి అశోక్ తెలిపారు. ఈ సారి పురస్కారానికి హైదరాబాద్‌కు చెందిన మాడభూషి లలితాదేవి, విజయవాడకు చెందిన మంజూలూరి కృష్ణకుమారి, సిరిసిల్లకు చెందిన డాక్టర్ కందేపి రాణీప్రసాద్, విశాఖపట్టణానికి చెందిన స్వరాజ్యం వెంకటరమణమ్మ ఎంపికయ్యారని, ట్రస్ట్ వ్యవస్థాపకుడు రంగినేని సుజాతమోహన్‌రావు పురస్కారం ప్రదానం చేయనున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ లావణ్య ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు.

గుంతను పూడ్చారు

-'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మొదటి బైపాస్ రోడ్డులో తాగు నీటి ట్యాంకు సమీపంలో డ్రైయినేజీపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై ఈ నెల 13న 'పొంచి ఉన్న ప్రమాదం' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ స్పందించారు. శుక్రవారం సిబ్బందితో గుంతను పూడ్చి వేయించారు.

కన్నుల పండువగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప మహాపడిపూజ నిర్వహిస్తున్న స్వాములు

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో శుక్రవారం అయ్యప్ప పడిపూజ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. పడిపూజ మహోత్సవాన్ని రాచ విద్యాసాగర్ గురుస్వామి నేతృత్వంలో నిర్వహించారు. సిరిసిల్ల పట్టణంలోని ధర్మశాస్త్ర పుంగావనం సన్నిధానానికి చెందిన అయ్యప్ప మాలధారులు శ్రీనివాసచార్యులు, నాగరాజు, సాయి, అజయ్, కోటేశ్వర్, మహాపాదయాత్ర చేపట్టిన ప్రయాకర్‌రావు మధుసూదన్, నారాయణ, బండారి మల్లేశం, కూర రాజేందర్, గురుస్వాములు దుబ్బ విశ్వనాథం, ఎరుకల ప్రకాష్, బల్కి రమేష్ పంతులు, కౌన్సిలర్లు కల్లూరి రాజు, వెల్దండి దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు నిల్వ చేసుకోవాలి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ రామారావు

వేములవాడ రూరల్/చందుర్తి డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : డీలర్లు ఎరువుల కొరత రాకుండా ముందుగానే నిల్వ చేసుకోవాలని వేములవాడ ఏడీఏ రామారావు అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల ఎరువుల డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లకు ఎరువుల నిల్వలు సరిపడా ఉండేలా చూసుకోవాలని, ఈపాస్ మిషన్ ద్వారానే ఎరువుల అమ్మకం జరగాలని, రైతులకు రశీదు తప్పకుండా ఇవ్వాలని అన్నారు. మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు, ఏఈవోలు రమ్య, శిరీష, యోగేశ్వర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎరువుల కొరత రాకుండా ముందస్తుగా నిల్వ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వీనిత అన్నారు. వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లిలోని రైతు వేదికలో ఎరువుల డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీలర్లు రైతులకు నాణ్యమైన ఎరువులను అందించాలన్నారు. ఎరువుల నిల్వలు సరిపడా ఉండేలా చూసుకోవాలని, కొనుగోలు చేసిన రైతులకు రశీదు తప్పకుండా ఇవ్వాలని అన్నారు. డీలర్లు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు



తనిఖీ చేస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో శుక్రవారం జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ అంజలి ఆల్బ్రెడ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ అంజలి ఆల్బ్రెడ్ మాట్లాడారు. చట్టాన్ని అతిక్రమించి లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, అబార్షన్ చేసినా స్కానింగ్ నిర్వాహకులపై ఆసుపత్రులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డాక్టర్ నహిమా జోహన్, హెచ్ఈ బాలయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

శంకరపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన క్యాదాసి సంపత్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. సంపత్ గతనెల 17న తన మోటర్ సైకిల్‌పై ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల వద్ద ఆరా తీశారు. ఆచూకీ లభించక పోవడంతో సంపత్ భార్య క్యాదాసి స్రవంతి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

గుండెపోటుతో ఒకరి మృతి

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన పెద్దూరి మల్లయ్య (56) అనే రజకుడు దుస్తులు ఇస్త్రీ చేస్తూ శుక్రవారం గుండెపోటుకు గురై మృతి చెందాడు. గ్రామానికి చెందిన మల్లయ్య తన కుల వృత్తిలో భాగంగా స్థానికంగా ఓ డబ్బాను ఏర్పాటు చేసుకొని దుస్తులు ఇస్త్రీ చేసేవాడు. రోజులాగే డబ్బాలో దుస్తులను ఇస్త్రీ చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా ఛాతిలో నొప్పి అంటూ కుప్పకూలి చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రజన సంఘం నాయకులు, స్థానికులు కోరారు.

ఆర్థిక ఇంబందులతో యువకుడి ఆత్మహత్య..

ముస్తాబాద్, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన కంచం సురేశ్(29) అనే యువకుడు శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై గణేశ్ వివరాల ప్రకారం.. పోతుగల్‌కు చెందిన సురేశ్ ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. సురేశ్ తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కడుపు నొప్పితో వివాహిత ఆత్మహత్య

వేములవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణానికి చెందిన సోమినేని మౌనిక (30) అనే వివాహిత కడుపునొప్పితో బాధ పడుతూ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన మౌనిక కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. మౌనిక తండ్రి తిరుపతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ ప్రకటనలో తెలిపారు.

ప్రపంచ చెస్ చాంపియన్‌గా

గుకేష్ గెలుపుపై సంబరాలు



సంబరాలు నిర్వహిస్తున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ చదరంగ చాంపియన్‌గా నిలిచిన గుకేష్‌కు అభినందనలు తెలియజేస్తూ జిల్లా కేంద్రంలోని జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ స్టేడియం ఆవరణలో ఘనంగా సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ క్రీడాకారులు, నగరంలోని క్రీడాకారులు భారీ ర్యాలీ నిర్వహించి, బాణా సంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. అతిథిగా పాల్గొన్న ఒలంపిక్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ చాంపియన్‌గా గుకేష్ గెలవడం భారతదేశానికి గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, పీడీ అంతటి శంకరయ్య, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్, జిల్లా డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శులు కంకటి సృజన్‌కుమార్, తాటిపల్లి సతీష్‌బాబు, చదరంగ బాధ్యులు అరుణ్, అనూష్, గౌతమ్, అభి, వెంకటేశ్, పీఈటీలు, చదరంగ క్రీడాకారులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తన కలిగిన వారికి రౌడీషీట్ల నుంచి విముక్తి

- సమీక్షకు డీసీపీ ఆధ్వర్యంలో కమిటీ
- పదేళ్ల క్రితం నమోదైన షీట్లపై పరిశీలన


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా రౌడీషీటర్ల జాబితాలో ఉండి సత్ప్రవర్తన కలిగిన వారికి షీట్ల నుంచి విముక్తి కల్పించాలని ప్రభుత్వం సూచనలు చేసింది. ఈ మేరకు రామగుండం పోలీస్ కమిషరేట్ పరిధిలో సత్ప్రవర్తన కలిగి, ఎలాంటి వివాదాలకు, నేరాలకు పాల్పడకుండా ఉన్న వారిని మానవీయ కోణంతో షీట్లపై సమీక్షించాలని పోలీస్ కమిషనర్ నిర్ణయించారు. పది సంవత్సరాల క్రితం రౌడీషీట్ నమోదై ఇప్పటి వరకు సత్ప్రవర్తన కలిగి ఉండి, ఎలాంటి నేరం చేయకుండా సాధారణ జీవితం గడిపితే వారి షీట్లు తొల గించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రస్తుత షీట్ల సమీక్షకు డీసీపీ చేతన ఆధ్వర్యంలో ఎస్‌బీ ఏసీపీ, పెద్దపల్లి, గోదావరిఖని ఏసీపీలతో ఒక కమిటీని ఏర్పా టు చేశారు. ఈ కమిటీ రౌడీషీటర్లు, కేడీ, సస్పెక్ట్ తదితర షీట్లపై సమీక్ష చేయనున్నది. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జిల్లాలో పోలీస్ రికార్డుల ప్రకారం 223మంది రౌడీషీటర్లు ఉన్నారు. ఇందులో గోదావరి ఖని వన్‌టౌన్‌లో అత్యధికంగా 59మంది రౌడీషీటర్లు ఉన్నారు. టుటౌన్‌లో నలుగురు, కమాన్‌పూర్‌లో ఇద్దరు, ఎన్‌టీపీసీలో 22, రామగుండంలో 4, మంథని లో 24, రామగిరిలో 12మంది రౌడీషీటర్లు ఉన్నారు. అలాగే పెద్దపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పెద్దపల్లి ఠాణా పరిధిలో 14, ధర్మారం 26, బసంత్‌నగర్ 18, సుల్తానాబాద్ 19, పాలకుర్తి 8, కాల్వశ్రీరాంపూర్ 2, జూలపల్లిలో 9షీట్లు ఉన్నాయి. గతంలో తీవ్ర నేరాలు, హత్యలు, హత్యాయత్నాలు, బహిరంగ దాడుల కు పాల్పడడం, బెదిరింపులు, బలవంతపు వసూళ్లు తదితర కేసులను దృష్టిలో ఉంచుకుని రౌడీషీట్లు తెరిచారు. ముఖ్యంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతం లో క్రూరమైన హత్యలు, నడిరోడ్డుపై దాడులు, మూకదాడులు, హత్యాచార యత్నాలను పరిగణలోకి తీసుకుని షీట్లు తెరిచారు. గతంలో కొందరు రౌడీషీ టర్లు షీట్లు తెరిచినా కూడా తమ ప్రవర్తన మార్చుకోకుండా ఇప్పటికీ బెదిరింపులు, గొడవలకు పాల్పడడం, కేసులు నమోదు అవడం వంటివి చోటు చేసుకుంటున్నాయి. మరికొందరు షీట్లు నమోదు అయినప్పటి నుంచి నేరాలకు, గొడవలకు దూరంగా ఉంటున్నారు. కొందరు తమపై ఉన్న షీట్లను తొలగించేలా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. కొందరు ఏళ్ల తరబడి ఠాణాల చుట్టూ తిరుగుతు న్నారు. ఇందులో 25ఏళ్ల క్రితం రౌడీషీట్లు నమోదు అయిన వారు కూడా ఉన్నా రు. మొత్తంగా నేర ప్రవృత్తికి దీర్ఘకాలంగా దూరంగా ఉన్న రౌడీషీట్లపై రామగుండం పోలీస్ కమిషనర్ పరిశీలన చేస్తుండడంతో రౌడీషీటు ఉన్న సాధారణ జీవితం గడుపుతున్న కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

మినీ ఏటీఎం కేంద్రాలే టార్గెట్..



- బిర్యాణి, ఫాస్ట్‌ఫుడ్ ఆర్డర్ల పేర టోకరా
- బ్యాంకు సెలవు రోజుల్లోనే మోసాలు
- గోదావరిఖని, పెద్దపల్లిల్లో వరుస ఘటనలు

కోల్‌సిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్కీమ్‌లు, లాటరీలు, బ్యాంకు రుణాల పేరిట మోసాలకు పాల్పడిన సైబర్ నేరస్థులు కొత్త తరహాలో మోసగించేందుకు ఎత్తులు వేస్తున్నారు. ఫోన్లలో స్థానికులుగా పరిచయం చేసుకుంటూ నమ్మబలుకుతున్నారు. స్థానికంగా ప్రముఖులు, వ్యాపారస్థుల పేర్లు చెప్పి మాటల్లోకి దించుతున్నారు. ఇటీవల ఆన్‌లైన్ నగదు బదిలీ కేంద్రాలు, మినీ ఏటీఎంలలో క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులతో నగదు బదిలీ అవుతుండడాన్ని ఆసరాగా చేసుకుని వాటినే టార్గెట్‌గా చేస్తున్నారు. ఫుడ్ ఆర్డర్ల పేర ఏక కాలంలో రెస్టారెంట్ల నిర్వాహకులు, మినీ ఏటీఎం నిర్వాహకులకు ఒకరికి తెలియకుండా ఒకరికి ఫోన్లు చేసి టోకరా వేస్తున్నారు. నిమిషాల్లోనే మాయచేసి వేలకు వేలు దండుకుంటున్నారు. బ్యాంకుల సెలవు రోజులనే టార్గెట్‌గా చేసుకుని బురిడీ కొట్టిస్తున్నారు. గోదావరిఖని, పెద్దపల్లిల్లో ఈ తరహా వరుస ఘటనలు చోటు చేసుకున్నాయి.

● పది నిమిషాల వ్యవధిలోనే

అదే రోజు పది నిమిషాల వ్యవధిలోనే గోదావరిఖని మెయిన్ రోడ్డులోని ఒక మినీ ఏటీఎం సెంటర్ నిర్వాహకుడికి ఫోన్ చేసిన సైబర్ నేరస్థుడు తాను మార్కండేయ కాలనీలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి ఎండీనని, తనకు పెట్రోల్‌బంక్‌లు, ఇతర వ్యాపారాలు ఉన్నాయని నమ్మబలికాడు. వరుసగా బ్యాంకులకు సెలవులు ఉన్నాయని, అందువల్ల తనకు డబ్బులు బదిలీ చేయాల్సిన అవసరం ఉందన్నాడు. తన ఉద్యోగి వస్తాడని, కమీషన్ తీసుకుని మిగతా డబ్బులు తన అకౌంట్‌లోకి పంపాలని సూచించాడు. అదే సమయంలో మినీ ఏటీఎం దగ్గరే ఉన్న మరో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యజమానికి ఫోన్ చేసి తనకు కొన్ని పార్సల్స్ అవసరమని, డబ్బులు పక్కనే ఉన్న మినీ ఏటీఎం నుంచి తీసుకోవాలని అతనికి సూచించాడు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు మినీ ఏటీఎం వద్దకు వెళ్లగా ఏటీఎం నిర్వాహకుడు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడిని తనకు ఫోన్ చేసిన ఆసుపత్రి ఎండీ వద్ద పనిచేసే ఉద్యోగిగా భావించాడు. అతడు రావడంతోనే రూ.55వేల సొమ్మును ఆసుపత్రి ఎండీగా చెప్పిన అకౌంట్‌కు బదిలీ చేశాడు. ముందున్న వ్యక్తే తనకు పార్సిళ్ల డబ్బులు ఇవ్వమని ఏటీఎం నిర్వాహకున్ని అడగడంతో అవాక్కయ్యాడు. మోసపోయానని గుర్తించి సైబర్ నేరస్థుడు చేసిన ఫోన్ నంబర్‌కు కాల్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. సైబర్ క్రైమ్ నెం.1930కు ఫోన్ చేసి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● జిల్లా కేంద్రంలోనూ..

ఇటీవల పెద్దపల్లిలోని ఒక నగదు బదిలీ కేంద్రం నిర్వాహకుడికి ఇదే తరహాలో సైబర్ నేరస్థుడు బురిడీ కొట్టించాడు. తనకు 100బిర్యాణి ప్యాకెట్లు అవసరమని ఫోన్‌లో ఆర్డర్ చేశాడు. అడ్వాన్స్ ఇవ్వాలని బిర్యాణి సెంటర్ నిర్వాహకుడు కోరడంతో భూంనగర్‌లోని మీ సేవ కేంద్రానికి వెళితే రూ.10వేలు ఇస్తాడని, మిగిలిన సొమ్మును తాను ఫోన్‌పే చేస్తానని నమ్మించాడు. అదే సమయంలో ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకుడికి ఫోన్ చేసిన అగంతకుడు తాను ఒకవ్యక్తి ద్వారా నగదు పంపిస్తున్నానని, ఆన్‌లైన్‌లో బదిలీ చేయాలని సూచించాడు. మీసేవ సెంటర్ నిర్వాహకుడు పని మీద బయటకు వెళుతూ షాపులో పని చేస్తున్న వ్యక్తికి తన పేరు చెప్పి ఎవరైనా వస్తే నగదు బదిలీ చేయాలని సూచించాడు. బిర్యాణి సెంటర్ నిర్వాహకుడు మీసేవా కేంద్రానికి వెళ్లి తనకు ఫోన్ చేసిన వ్యక్తికి మరోసారి ఫోన్‌చేసి మీ సేవలో పని చేస్తున్న వ్యక్తికి ఫోన్ ఇచ్చాడు. నేను మీ యజమానితో మాట్లాడాను, నేను చెప్పిన నంబర్లకు డబ్బులు బదిలీ చేయమనడంతో షాపులో పనిచేస్తున్న వ్యక్తి మూడు నంబర్లకు మొత్తం రూ.55వేలు బదిలీ చేశాడు. మీ ముందున్న వ్యక్తి నగదు ఇస్తాడు, తీసు కోండని ఫోన్ కట్ చేశాడు. ముందున్న వ్యక్తిని డబ్బులు ఇవ్వమని అడుగగా తాను బిర్యాణి సెంటర్ నిర్వాహ కుడినని, తాను డబ్బులు ఇవ్వడం ఏంటి? మీ దగ్గర డబ్బులు తీసుకోమని కస్టమర్ చెబితే వచ్చానని తెలు పడంతో మోసపోయామని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● బిర్యాణి పాయింట్ల పేరుతో..

సైబర్ నేరస్థులు ప్రజల అవసరాలు, నమ్మకాలను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. మినీ ఏటీఎంలలో ఆర్థిక లావాదేవీలు ఎక్కువగా సాగుతుండడంతో వాటినే లక్ష్యంగా చేసుకుంటున్నారు. అను మానం రాకుండా తెలుగులో మాట్లాడుతూ స్థానికంగా పరిచయం ఎక్కువ ఉన్న వ్యాపారులు, ఆసుపత్రి నిర్వాహకుల పేర్లను వాడుకుంటున్నారు. ముఖ్యంగా బ్యాంకు సెలవు దినాల్లో ఆన్‌లైన్ నగదు బదిలీ సెంటర్లకు గిరాకీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండడం, రద్దీ సమయాల్లో నిర్వాహకులను ఏమార్చి బురిడీ కొట్టిస్తున్నారు. గోదావరిఖని మార్కండేయ కాలనీలోని ఒక ప్రముఖ బిర్యాణి సెంటర్ నిర్వాహకులకు రెండు నెలలక్రితం ఫోన్ చేసిన సైబర్ నేరస్థుడు పట్టణానికి చెందిన ఒక కాంట్రాక్టర్‌గా చెప్పుకున్నాడు. తాను చిన్న పార్టీ ఇస్తున్నానని, 55బిర్యాణి పార్సిళ్లు అవసరమని పేర్కొన్నాడు. బ్యాంకు సెలవు దినాలు కనుక నగదు లేదని, సమీపంలోని మినీ ఏటీఎం పేరు చెప్పి అక్కడికి వెళ్లి డబ్బులు తీసుకోవాలని సూచించాడు. సంబంధిత మినీ ఏటీఎంకు ఫోన్ చేసి తాను ఒక మనిషిని పంపుతున్నానని, అతడు నగదు ఇస్తాడని, కమీషన్ ఎక్కువైనా తీసుకుని మిగతా డబ్బులు తన అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయమని చెప్పాడు. బిర్యాణి సెంటర్ నిర్వాహకుడికి గానీ, మినీ ఏటీఎం నిర్వాహకుడికి గానీ అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డాడు.

బిర్యాణి సెంటర్ నిర్వాహకుడు తమకు ఫోన్ చేసిన కాంట్రాక్టర్ ఆర్డర్ తాలుకా డబ్బు లు ఇస్తారని ఆశించి మినీ ఏటీఎం వద్దకు వెళ్లాడు. తనను సదరు కాంట్రాక్టర్ పంపాడని చెప్పడంతో మినీ ఏటీఎం నిర్వాహకుడు తనకు ఫోన్ చేసి నగదు బదిలీ చేయమన్న వ్యక్తి తన మనిషిని డబ్బులు ఇచ్చి పంపాడేమోనని భావించాడు. వచ్చిన వ్యక్తి నుంచి డబ్బులు తీసుకోకుండానే ఫోన్‌లో చెప్పిన వ్యక్తి అకౌంట్‌కు రూ.45వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. డబ్బులు పంపిన తరువాత తన ముందున్న వ్యక్తికి నగదు ఇవ్వమని అడుగగా అసలు విషయం బయట పడింది. తాను బిర్యాణి సెంటర్ నుంచి వచ్చానని, తనకే ఇక్కడ డబ్బులు ఇస్తారని ఫోన్ చేశారని తెలుపడంతో అసలు మోసం బయట పడింది.

● స్థానిక వ్యాపారుల పేర్లు, వివరాలతో మోసాలు..

సైబర్ నేరస్థులు ఇన్నాళ్లు ఫోన్ నంబర్ల ఆధారంగానే మోసాలకు పాల్పడేవారు. ఇప్పుడు మీసేవా నగదు బదిలీ కేంద్రాలు, ప్రముఖ వ్యాపార సంస్థల వివరాలు గూగుల్ మ్యాప్‌లో అందుబాటులో ఉంటాయి. దీని ఆధారంగా ఆన్‌లైన్‌లో నిర్వాహకుల పేర్లు, వ్యాపార వివరాలను సైబర్ నేరస్థులు సేకరిస్తున్నారు. వీటి ఆధారంగానే సులువుగా మోసాలకు పాల్పడుతున్నారు. నాలుగు రోజుల క్రితం గోదావరిఖనిలోని పలువురు వ్యాపారులకు ఫోన్లు చేసి తాము మున్సిపల్ కార్పొరేషన్ నుంచి మాట్లాడుతున్నామని, ట్రేడ్ లైసెన్స్‌ల సొమ్ము ఏకకాలంలో తాము చెప్పిన నంబర్లకు ఫోన్‌పే ద్వారా పంపాలంటూ ఒత్తిడి చేశారు. దీంతో వ్యాపారులు అప్రమత్తమయ్యారు.

● అప్రమత్తతోనే రక్షణ...

సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే మోసపోకుండా రక్షణ పొందే అవకాశం ఉంటుంది. ఏ చిన్న ఫోన్‌కాల్ విషయంలో ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు.

రోడ్డు పక్కన దేశ నాయకుల ఫొటోలు

- ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రజలు


రోడ్డు పక్కన పడేసిన దేశనాయకుల ఫొటోలు

కొడిమ్యాల, డిసెంబరు13 (ఆంధ్ర జ్యోతి): కొడిమ్యాల నుంచి పూడూర్ వెళ్లేదారిలో రోడ్డు పక్కన శుక్రవారం దేశ నాయకుల ఫొటోలు కనిపించాయి. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్, జాతిపిత మహా త్మాగాంధీ చిత్రపటాలతో పాటు మరి కొంత మంది మహనీయుల ఫొటోలు రోడ్డు వెంట వెళ్లేవారిని ఆశ్చర్యానికి గురిచేశాయి. ఈ సందర్భంగా ఎమ్మా ర్పీఎస్ జిల్లా, రాష్ట్ర నాయకులు కొత్తూరి స్వామి, అధ్యక్షుడు సురుగు శ్రీను మాట్లాడుతూ మహనీయులను అవమాన పరిచే విధంగా ఫొటోలను రోడ్డుపై పడేసిన వారిని గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు.

యాదవ విద్యావంతుల వేదిక జిల్లా కార్యవర్గం


జిల్లా కన్వీనర్ రాజయ్య


కో కన్వీనర్ పోచమల్లు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యాదవ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్, కో కన్వీన ర్లను నియమిస్తూ వేదిక రాష్ట్ర అధ్య క్షుడు చలకాని వెంకట్‌యాదవ్ ప్రకట న జారీ చేశారు. జిల్లా కన్వీనర్‌గా ఆసర రాజయ్య యాదవ్, కోకన్వీన ర్‌గా పోచమల్లు యాదవ్‌ను నియ మించారు. జిల్లాలో యాదవ విద్యావం తుల వేదికను పటిష్ట పరిచే విధంగా కృషిచేయాలని సూచించారు. వీరి నియామకం పట్ల పలువురు వేదిక నా యకులు, యాదవులు హర్షం వ్యక్తం చేశారు.

మహా శివరాత్రి వరకు సౌకర్యాలు కల్పించాలి

- జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

సారంగాపూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వరకు భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుక రావాలని జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. సారంగాపూర్ మండలంలోని పెంబట్ల శ్రీ దుబ్బరాజేశ్వర స్వామి దేవాలయాన్ని బీఆర్‌ఎస్ నేతలతో కలిసి శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఎంపీగా కవిత గతంలో మంజూరు చేసిన రూ 86 లక్షల నిధులతో చేపట్టిన గోపురం, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ పనులు వేగవంతంగా, నాణ్యత ప్రమాణాలు పాటించి పూర్తి చేయించాలని ఆమె తెలిపారు. అలాగే బీర్‌పూర్ లక్ష్మీ నరసింహ స్వామి, జగిత్యాల గుట్ట రాజేశ్వర స్వామి, కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయాలకు కూడ నిధులు మంజూరు చేసినట్లు ఆమె గుర్తు చేశారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ సారంగపూర్ మండల అధ్యక్షులు తేలు రాజు, సారంగపూర్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాగి సత్యంరావు, మండల యూత్ అధ్యక్షులు సిలివేరి మదన్, ఒడ్నాల జగన్, అత్తినేని నరేష్, ఆకుల తిరుపతి, ఎండబెట్ల ప్రసాద్, సాంబారి గంగాధర్, రమేష్, జలందర్, అలీం, వేణు, రవి, బండారి వెంకటేష్, సుమన్‌నాయక్, అరవింద్‌గౌడ్, రవిగౌడ్, శ్రీను, రాజరెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడి పూజా మహోత్సవం


అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

కోరుట్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తిలక్‌రోడ్డులో అయ్యప్ప పడిపూజ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. వేదపండితుడు పాలెపు రామకృష్ణ మంత్రోచ్చారణల మధ్య పడిపూజ మహోత్సవాన్ని నిర్వహించారు. కాలనీకి చెందిన రుద్ర వసంత్ కుమార్ కన్నె స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు. గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప స్వాముల ఉత్సవ మూర్తులకు అభిషేక కార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేక పూజలను జరిపారు. వేంకటేశ్వర భజన మండలి గురుస్వామి గట్ల అనంద్ ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలను నిర్వహిచారు. రుద్ర వసంత్ కుమార్ స్వాములకు అన్న ప్రసాదం అందించగా బారీగా స్వాములు పాల్గొన్ని అన్న ప్రసాదాన్ని స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు అంబల్ల శ్రీనివాస్, జుంబర్తి రమేష్, ప్రశాంత్, సాయి, తోట రాజు, గడ్డం మధులతో పాటు పలువురు పాల్గొన్నారు.

వర్గీకరణపై సీఎం స్పందించాలి

- ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు, అంబేద్కర్ సంఘ నాయకులు

కోరుట్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కోరుట్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి కార్యాలయ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో మహిళా సోదరీమణులు డప్పు కళాకారులు సిందు మాదిగల ఆధ్వర్యంలో పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ నాయకులు మాట్లాడుతూ 32 సంవత్సరాలుగా పలు పార్టీలు కమీషన్లు, కమిటీలు వేస్తూ వస్తున్నారని ఇప్పటి వరకు ఏ ఒక్క నాయకుడు గానీ పూర్తిస్థాయిలో వర్గీకరణ చేపట్టలేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో భారతదేశంలోనే మొట్ట మొదటిసారి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఏకగ్రీవంగా తీర్మానం చేసి వర్గీకరణ చేస్తామని వాగ్ధానం చేసారని అన్నారు. ఇప్పుడు ఒక కమిటీ వేశారని కమిటీ కాలయాపన కోసం పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ, ఎంఆర్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి వనతపుల అంజయ్య, నాయకులు రాజశేఖర్, నారాయణ, ఎర్ర శంకర్, బలవంతుల సురేష్, పేట భాస్కర్, రాజేష్, సీహెచ్ లక్మణ్, శనిగారపు వినోద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడి అరెస్టు

జమ్మికుంట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ యువకుడు శుక్రవారం రాత్రి మహిళలతో అసభ్యంగా ప్రవర్తించాడు. మంచిర్యాలకు చెందిన భోగి అఖిల్ తన బాబాయ్ కుమార్తె ఎంగేజ్‌మెంట్ కోసం జమ్మికుంటకు వచ్చాడు. ఒంటిపై దుస్తులు లేకుండా జమ్మికుంట బస్టాండ్ వద్ద యువతులు, మహిళల వద్దకు వచ్చి వీరంగం సృష్టించాడు. యువకుడి ఆగడాలతో విసుగు చెందిన ప్రయాణికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు యువకుడిని స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.

● ఆన్‌లైన్ క్లిక్..

పనులు ఎప్పటికి పూర్తయ్యేను...?

నగరం నుంచి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా చొప్పదండి రోడ్డులో తీగలగుట్టపల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభమై ఏడాది దాటినా ముందుకు సాగడం లేదు. ఓవైపు పిల్లర్లు వేసి వదిలేయగా మాణిక్యేశ్వరి గుడివైపు స్లాబ్ దశలో నిలిచిపోయి ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. రైలు గేటు పడటంతో పెద్ద సంఖ్యలో వాహనాలు రోడ్డుపై నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, కరీంనగర్


తీగలగుట్టపల్లి వద్ద పిల్లర్ల దశలో నిలిచిపోయిన రైల్వే ఓవర్ బ్రిడ్జి


రైలు గేటు పడడంతో ప్రయాణికుల ఇక్కట్లు


తీగలగుట్టపల్లివైపు ఓవర్ బ్రిడ్జి స్లాబ్ దశలో నిలిచిపోయిన పనులు

16 నుంచి ధనుర్మాసోత్సవాలు



ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి

ధర్మపురి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో సోమవారం నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం అవుతాయని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ఆలయాలు ఉదయం 3 గంటలకు తెరచి ఉంచుతారని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఉదయం 4 గంటల నుంచి 5-30 వరకు స్వామి వారికి నిత్యం అర్చకులు ప్రత్యేక అభిషేకం, స్వామి వారికి తిరుప్పావై ప్రబంధం జరుపుతారని తెలిపారు. అనంతరం స్వామి వారికి నైవేద్యం సమర్పిస్తారని పేర్కొన్నారు.

నేషనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఖని క్రీడాకారుడికి చోటు



సంతోష్ ట్రోఫీ జట్టుకు ఎంపికైన క్రీడాకారుడు అభిషేక్

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో తెలంగాణ నుంచి గోదావరిఖనికి చెందిన అభిషేక్‌కు జట్టులో చోటు లభించింది. గత ఏప్రిల్‌లో గోదావరిఖనిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో కరీంనగర్ జట్టు 3వ స్థానంలో నిలువగా సీనియర్ నేషనల్ టీమ్ సెలక్షన్‌లో సంతోష్ ట్రోఫీ కోసం నిర్వహించిన ఎంపిక జట్టులో అభిషేక్ తెలంగాణ జట్టు నుంచి ఆడనున్నాడు. ఎంపికైన అభిషేక్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రెటరీ గణపతి అభినందించారు.

ఎస్‌యూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

గణేశ్‌నగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమైనట్లు శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. ఉదయం మొత్తం 12,220 విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, 11,205 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు.

'కళ' తప్పిన చిందు యక్షగానం



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు (ఫైల్)



ప్రదర్శనలో వేషధారణ (ఫైల్)

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు వీనుల విందైన సంగీతాన్ని అందించిన వారి హార్మోనియం నేడు మూగబోతోంది.. విశేష ఆదరణ పొందిన చిందు యక్షగానం కళతప్పింది. పాశ్చాత్య సంస్కృతి చిందు యక్షగాన కళను కబళిస్తోంది. చిందు యక్ష కళాకారుల ప్రదర్శన ఉందంటే ఊళ్లోని చిన్నా, పెద్దలు భారీ సంఖ్యలో తరలివచ్చేవారు. రామరావణ, శ్రీకృష్ణార్జున యుద్ధం, అల్లీరాణి, చెంచులక్ష్మి, భక్తప్రహ్లాద, సత్యహరిశ్చంద్ర, గుణసుందరికథ, చిరుతల రామాయణం తదితర నాటకాలను రాత్రంతా ఆసక్తిగా చూసేవాళ్లు. ఊళ్లో నాటకం ఉందంటే చుట్టు పక్కల గ్రామాల వారు ఎడ్లబండ్లపై ఉత్సాహంగా తరలివచ్చిన రోజులు ఉన్నాయి. ఆనాడు కళాకారులకు గ్రామస్థులు, గ్రామ పెద్దలు, కుల సంఘాల ఆధ్వర్యంలో కళాకారులకు డబ్బులు, ధాన్యంతోపాటు వస్త్రాలు, కానుకలు ఇచ్చి సత్కరించేవారు. టీవీలు, సినిమాలు రాకతో చిందు యక్షగానకళలతో పాటు వీధి బాగోతాలు, బుర్రకథ, హరికథలు అంతరించే దశలో ఉన్నాయి. ఆదరణ కరువై కళాకారులకు ప్రదర్శనలు లేక జీవనోపాధి కరువైంది. దీంతో కుటుంబ పోషణ కోసం కొందరు కళాకారులు కూలీలుగా మారారు. ఆదరణ లేక ఈ కళను నేర్చుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో చిందు యక్షగానం ప్రాభవం కోల్పోతున్నది.

● చిందు యక్షగానం.

చిందు యక్షగానాన్ని సుమారు 12మంది సభ్యులు రక్తి కట్టిస్తారు. హార్మోనియం, తబలా, తాళాలు ప్రధాన వాయిద్యాలు. ఏ నాటకం వేసినా ఒకరు విలన్, ఒకరు హీరో, ఒకరిద్దరు ఆడవేషాలు, ఒక బుడ్డరఖాన్, సహాయకులు ఒకరిద్దరు, మిగతా వారందరూ వాయిద్య సహకారం, కోరస్ అందిస్తారు. నాటకాన్ని మూడు నుంచి ఐదు రోజుల వరకు వేసేవారు. ఊరందరూ కలిసి వీరిని ప్రతి సంవత్సరం పిలిపించుకొని శుభకార్యాల్లో నాటకాలు వేయించేవారు. భోజనం, విడిది ఏర్పాటు చేసేవారు.

● వారి కోరికలివే...

నెలనెలా ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి కళాకారులను ఆర్థికపరంగా ఆదుకోవాలని, చిందుయక్షగాన యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయాలని, సంఘ భవనాన్ని నిర్మించి, పింఛన్ ప్రతినెలా అందేలా చూడాలని ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సందర్భంలోనైనా తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

● కరవైన ఉపాధి

చిందు యక్షగాన కళ ప్రదర్శనలు లేక నిరాదరణకు గురవుతున్నది. ప్రదర్శనలు లేకపోవడంతో కళాకారులకు పూట గడవడం కష్టంగా మారింది. అప్పుడప్పుడు ఎవరైనా ప్రదర్శనకు పిలిస్తే వెళ్లి కళకు జీవం పోస్తున్నారు. గతంలో ప్రభుత్వాలు అక్షరాస్యత నిర్మూలన, కుటుంబ నియంత్రణ, సంపూర్ణ పారిశుధ్యం, జన్మభూమి తదితర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చేపట్టిన కార్యక్రమాల ద్వారా కళాకారులకు ఉపాధి కల్పించింది. ఆ తర్వాత ప్రభుత్వాలు పట్టించుకోక నానాటికీ వారి జీవితాలు అగమ్యగోచరంగా మారాయి.

● తీగలగుట్టపల్లిలో వంద కుటుంబాలు

కరీంనగర్ మండలం తీగలగుట్టపల్లి గ్రామంలో దాదాపు వంద కుటుంబాలకు పైగా చిందు కుటుంబాలు ఉన్నాయి. గతంలో నాటక ప్రదర్శనతో ఉపాధి పొందిన కళాకారులు ప్రస్తుతం పూట గడవని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఒక వైపు ప్రదర్శనలు లేకపోవడం, మరో వైపు ప్రభుత్వ పథకాల ప్రచారంలో అవ కాశం కల్పించకపోవడంతో కళాకారులు ఇతర వృత్తులను ఆశ్రయించారు. యువకులు ఈ వృత్తిని విడిచి ఉపాధినిచ్చే వృత్తుల్లో స్థిరపడ్డారు. ప్రస్తుతం ఈ గ్రామంలో పదుల సంఖ్యలో మాత్రమే వృద్ధ కళాకారులున్నారు. నలుగురికి తప్ప కొందరికి వృద్ధకళాకారులకిచ్చే పింఛన్ సైతం మంజూరు కాకపోవడంతో ఆర్థికం గా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలువురికి నివాస గృహాలు కూడా లేకపోవడంతో పూరి గుడిసెల్లో జీవితం గడుపుతున్నారు.



2003లో శాతవాహన కళోత్సవాల్లో పాల్గొన్న కళాకారులు (ఫైల్)

● ప్రభుత్వం ఆదుకోవాలి



ఒకప్పుడు యక్షగాన ప్రదర్శనల ద్వారా కుటుంబంలోని అందరికి ఉపాధి దొరికింది. కళాకారులకు, కళకు గౌరవముండేది. ఇప్పుడు ఆదరణ లేకపోవడంతో ఉపాధి కరువయింది. ప్రభుత్వ పథకాల ప్రచార కార్యక్రమాల్లో సైతం అవకాశమివ్వకపోవడంతో ఉపాధిలేక రోడ్డున పడ్డాం. ఆదుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తగిన చర్యలు చేపట్టాలి.

- గజవెల్లి కిష్టయ్య, చిందు యువజన యక్షగాన కళాకారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు

● ఆసరాగా నిలవాలి




కళాకారులకు తగిన ప్రాధాన్యం కల్పించి ప్రదర్శనలకు అవకాశం కల్పించి ఆదుకోవాలి. కళాకారులకు పింఛన్ అందజేసి ఆసరాగా నిలవాలి. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి.

- గడ్డం అంతయ్య, కళాకారుడు

పశుగ్రాసానికి డిమాండ్

- గడ్డి కట్ట ధర రూ. 80
- మెట్ట ప్రాంతానికి తరలిస్తున్న పశుపోషకులు



దమ్మక్కపేటలో పశుగ్రాసాన్ని తీసుకెళ్తున్న రైతులు

హుజూరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతంలో పశుగ్రాసానికి భలే డిమాండ్ ఉంది. గత ఏడాది యాసంగిలో వరి పంటలు నీళ్ల లేక ఎండిపోయాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని ముందస్తుగానే రైతులు పశుగ్రాసాన్ని నిల్వ చేసుకుంటున్నారు. వరి కోతలు దాదాపుగా పూర్తయ్యాయి. రైతులు తమ పశువుల మేత కోసం గడ్డిని సేకరిస్తున్నారు. కొంత మంది రైతులు గడ్డిని రోలర్ తెప్పించుకొని గడ్డి కట్టలు చుట్టించుకుంటున్నారు. ఒక వరిగడ్డి కట్టకు మెట్ట ప్రాంత రైతులు రూ. 80 చెల్లిస్తున్నారు. మెట్ట ప్రాంతమైన సైదాపూర్, హుస్నాబాద్, భీమదేవరపల్లి, కోహెడ, ఎల్కతుర్తి, జనగామ, స్టేషన్ ఘణపూర్ తదితర ప్రాంతాలకు లారీలు, ట్రాక్టర్లలో తీసుకెళ్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రతి ఇంటికి పాడి పశువులు ఉండడంతో ఈ పశుగ్రాసాన్ని సేకరిస్తున్నారు. వేసవిలో పశుగ్రాసం కొరత ఉంటుందనే భయంతోనే ముందుగానే రైతులు జాగ్రత్త పడుతున్నారు. ప్రస్తుతం రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు ఆసక్తి కనబరుస్తుండడంతో పశువుల పేడకు డిమాండ్ ఉంది. దీంతో పశుగ్రాసాన్ని కొనుగోలు చేస్తున్నారు. పశువుల పేడకు ట్రాక్టర్‌కు రూ. 3వేల ధర పలుకుతుండడంతో రైతులకు ప్రయోజనంగా ఉందని చెబుతున్నారు.



సైదాపూర్ మండలం బొమ్మకల్‌లో నిల్వ చేసిన గడ్డి కట్టలు

పరిశోధనలతోనే విప్లవాత్మక మార్పులు

- రైతులు పంటల మార్పిడిపై దృష్టి సారించాలి - జయశంకర్ విశ్వవిద్యాలయ వజ్రోత్సవాల్లో వక్తలు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తల పరిశోధనల ఫలాల వల్లనే వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని, క్షేత్రస్థాయి రైతులకు ఇవి అందినప్పుడే సంపూర్ణ అభివృద్ధి సాధ్యం అవుతుందని వక్తలు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పడి 60ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా పరిశోధన స్థానంలో ముందస్తు వజ్రోత్సవాలు ఏడీఆర్ గాదె శ్రీనివాస్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, అతిథులుగా ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌తో పాటు శాస్త్రవేత్తలు, విద్యార్థులు, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు సావనీర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ పొలాస వ్యవసాయ పరిశోధన స్థానానికి రాష్ట్రంలో ప్రత్యేక స్థానం ఉందని, దాని కొనసాగింపునకు మరింతగా కృషిచేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పంటల సాగు విధానం వైపు వెళ్లకుండా, వాణిజ్య లాభాదాయ పంటల వైపు దృష్టిని మరల్చి అధిక లాభాలు పొందాలని సూచించారు. హైదరాబాద్ శంషాబాద్ వద్ద హైడ్రోఫోలిఫ్ విధానంతో సుమారు వెయ్యి ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తున్నారని, ఆ విధా నం మన వద్ద కూడా అవలంబిస్తే రైతులకు ఉపయో గకరంగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ జగిత్యాల జిల్లా కేంద్రంగా కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వజ్రోత్స వాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఈ సందదర్భగా ప్రశంసాపత్రాలు అందజేశారు.

- ఆకట్టుకున్న స్టాల్స్..

యూనివర్సిటీ వజ్రోత్సవాల వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ రైతులను, అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రైతులకు అవసరమైన పరికరాలు, పనిముట్లు, వంగడాలను ఈ స్టాల్స్‌లో ప్రదర్శించారు. విత్తన ప్రదర్శన కార్యక్ర మంలో భాగంగా తెలంగాణ ప్రాంతంతో పాటు జిల్లాలో సాగు చేస్తున్న వివిధ వంగడాలతోపాటు, చెరుకు, మొక్కజొన్న, సోయ వంటి ఉత్పత్తులను, వాటి దిగుబడులను అతిథులకు విద్యార్థు లు, శాస్త్రవేత్తలు వివరించారు.

విద్యావంతులకు సాగుపై ఆసక్తి..

- వెల్మల రాంరెడ్డి, రైతు, పూడూర్



కొందరు విద్యావంతులు సాగుకు ఆసక్తి చూపుతూ, నూతన విధానాలతో రాణిస్తుండడం అభినందనీయం. జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ ఈ యేడాది వజ్రోత్సవాలు నిర్వహించుకోవడం శుభ పరిణామం. 60ఏళ్లలో వ్యవసాయ రంగంలో అభివృద్ధి జరిగిన మాట వాస్తవమే. కొత్త వంగడాలు, యాంత్రీకరణ జరిగింది. కానీ ప్రస్తుత వ్యవసాయంతో బతుకుదెరువు ఉందనే భరోసా లేకుండా పోతోంది. రైతు వారసులు అంతగా వ్యవసాయం వైపు ఆసక్తి చూపడం లేదు.

మార్కెటింగ్ విధానంపై పరిశోధనలు జరగాలి..

- పులి లక్ష్మీపతి, రైతు, బోయినిపెల్లి



వ్యవసాయ పరిశోధన స్థానంతో దశాబ్దాల అనుబంధం ఉంది. ప్రస్తుత యేడాది యూనివర్సిటీ వజ్రోత్సవాలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉంది. కానీ నూతన వరి వంగడాలు కనుగొనడం, వాటి ఫలాలను రైతుల చెంతకు చేర్చడంలో జాప్యం జరుగుతున్నది. జాప్యాన్ని నిలువరించే చర్యలు తీసుకోవాలి. ఆంధ్రా వంగడాల మాదిరిగా, తెలంగాణ వంగడాలు పోటీని అధిగమించలేకపోతున్నాయి. రైతు ఆలోచనలు, ఆకాంక్షలతో పాటు వారి అభివృద్ధికి అను గుణంగా పరి శోధనలు జరగాలి. భవిష్యత్తులో పీజేటీఏయూ చర్యలు తీసుకునేందుకు ముందుకు సాగుతుందని ఆశిస్తున్నాం.

వైద్య సేవలపై తనిఖీ బృందం పరిశీలన



సభ్యులకు స్వాగతం పలుకుతున్న వైద్య సిబ్బంది

వీణవంక, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామంలోని పీహెచ్‌సీలో అందుతున్న సేవలను పరిశీలించేందుకు శుక్రవారం జాతీయ నాణ్యత పరిశీలన అధికారులు వచ్చారు. ఈ మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, మెడికల్ ఆఫీసర్ వరుణ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, ప్రసవాల సంఖ్యను అడిగి తెలుసుకొని వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో జాతీయ నాణ్యత తనిఖీ బృందం సభ్యులు డాక్టర్ శరమ భాను, డాక్టర్ శర్మ, భరత్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ వరుణ, ఎంసీహెచ్ సన జవీరా తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

త్యాగరాజ ఉత్సవాలకు దరఖాస్తుల ఆహ్వానం

వేములవాడ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో 18 జనవరి 2025 నుంచి 22 జనవరి వరకు నిర్వహించనున్న త్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవాలకు కళాకారులు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. ఉత్సవాల్లో సుప్రసిద్ధ కళాకారుల శాస్త్రీయ, సంగీత, జంత్రవాద్య సోలో, హరికథ, నృత్య, నాటక, ఉపన్యాస, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇప్పపూల దేవేందర్, టీటీయూ జిల్లా అధ్యక్షుడు కొండి కోప్పుల రవి, టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ డిమాం డ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా కమి టీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శుక్రవారానికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. కేజీబీవీ పాఠశాలలకు చెందిన ఎస్‌వోలు, యూ ఆర్‌ఎస్ ఎస్‌వోలు, ఉద్యోగులు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలి పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సంఘాలకు చెందిన పలువురు మద్దతు తెలిపారు. దీక్షల్లో బుర్ర జలేందర్, జయలక్ష్మీ, నీరజ, వెంకట రమణ, పద్మ, నరేందర్, శ్రీనివాస్, దేవరాజ్, సలీం, వెంకటేష్, శ్యామల పాల్గొన్నారు.



పెద్దపల్లిలో బతుకమ్మ ఆడుతూ నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

పెద్దపల్లి రూరల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏకశిలా పార్కు వద్ద ఇచ్చిన హామీని అమలు చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న సమ్మె శుక్రవారానికి నాలుగో రోజుకు చేరుకుంది. పెద్దపెల్లి దీక్ష శిబిరాన్ని ఉపాధ్యాయ సంఘ నాయకులు. టీటీయూ ప్రెసిడెంట్ రవి కుమార్ జనరల్ సెక్రెటరీ మానసూర్ సీపీఐ జిల్లా సీక్రెట్ తాండ్రా సదానందం ఏఐఎస్‌ఎఫ్ ప్రెసిడెంట్ మనస కుమార్ మద్దతు ప్రకటించారు శుక్రవారం రోజున మహిళా ఉద్యోగులు బతుకమ్మలు పేర్చి రోడ్డుపై పెట్టి ఆడుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు తిప్పని తిరుపతి. కేజీబీవీ రాష్ట్ర నాయకురాలు పుల్లూరి సంధ్యారాణి. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారు కుంబాల సుధాకర్, రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి మల్లన్న, రామగిరి రవిరాజు, కస్తూర్బా బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారులు స్వప్న, విజయలక్ష్మి, కమల, జ్యోతి, స్వప్న, జిల్లా నాయకులు పిల్లి రమేశ్, ఆర్ కృష్ణయ్య, సీఆర్పీలు, పీజీ సీర్పీలు, కోఆర్డినేటర్లు. సీసీవోలు, మెసెంజర్లు 250మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం



ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

భగత్‌నగర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): లగిచర్ల రైతులకు బేడీలు వేసినందుకు నిరసనగా కమాన్ చౌరస్తాలో బీజేపీ నాయకులు ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ అల్లుడి ఫార్మా కంపెనీని సొంత భూముల్లో ఏర్పా టు చేసుకోకుండా దళిత నిరుపేద గిరిజన రైతుల భూములు లాక్కోవడం ఎందుకో కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో దుబాల శ్రీనివాస్, నాంపల్లి శ్రీనివాస్, గుంజేటి శివకుమార్, అవుదుర్తి శ్రీనివాస్, పురం హరిశంకర్, తణుకు సాయికృష్ణ, కలికోట మోహన్, మాచర్ల కోటేష్, పోరెడ్డి శ్రీధర్ పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి వృద్ధుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైమ్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు అపార్ట్‌మెంట్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కట్టరాంపూర్‌కు చెందిన కుంకుమల్ల శ్రీరాములు(78) తనకుటుంబంతో ఒక అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. ఐదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ పలుమార్లు చనిపోతానని కుటుంబసభ్యులతో అంటుండేవాడు. శుక్రవారం ఐదో అంతస్తుకు వెళ్లి అక్కడి నుంచి కిందకు దూకాడు. తలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

న్యూస్ బాక్స్

సీఎం కప్ విజేతలకు నగదు అందజేత

ఇల్లంతకుంట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపెల్లి గ్రామ క్రీడాకారులు సీఎం కప్ విజేతలుగా నిలవడంతో మాజీ సర్పంచ్ అరుకుటి విజయలక్ష్మిమల్లేశం నగదు అందజేశారు. గాలిపెల్లి గ్రామంలో మూడు రోజుల పాటు జరిగిన మండలస్థాయి పోటీలలో గాలిపెల్లి గ్రామ క్రీడాకారులు కబడ్డీ, వాలీబాల్ పోటీలలో ప్రథమ స్థానం సాధించారు. మాజీ సర్పంచ్ రూ.5వేల నగదును అందించారు. క్రీడాకారులకు ఈతరం యువజన సంఘ వ్యవస్థాపకుడు ఎంఢ్ర నారాయణ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఢ్ర నారాయణ, అశోకొరెడ్డి, రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

ఇల్లంతకుంట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిట్టి ఆనందరెడ్డిని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం పరామర్శించారు. ఆనందరెడ్డి తల్లి లక్ష్మవ్వ అనారోగ్యంతో వారం రోజుల క్రితం మృతి చెందారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, దామోదర్ పాల్గొన్నారు.

పాత్రికేయుడికి..

కోనరావుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పాత్రికేయుడు ఊరడి మల్లికార్జున్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తోపాటు పలువురు నేతలు శుక్రవారం పరామర్శించారు. మల్లికార్జున్ తల్లి ఊరడి రామవ్వ బావుసాయిపేట గ్రామంలో మృతి చెందారు. నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లయ్య, కేతిరెడ్డి జగన్‌మోహన్ రెడ్డి, ఫిరోజ్ పాషా, నందు గౌడ్, బీఆర్ఎస్ నేత మనోహర్ రెడ్డి ఉన్నారు.

సెలవులో రాజన్న ఆలయ ఈవో

వేములవాడ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈవో వినోద్‌రెడ్డి వ్యక్తిగత కారణాలతో ఐదు రోజులపాటు సెలవు తీసుకున్నారు. రాజన్న ఆలయంలో ఈఈగా విధులు నిర్వర్తిస్తున్న రాజయ్యకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చినట్లు తెలుస్తోంది. రాజన్న కోడెల వివాదం నెలకొనడం, ఈవో ఐదు రోజులు సెలవుపై వెళ్లడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది.

దోసల చంద్రంకు పరామర్శ

గంభీరావుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రంను మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రాగుల రాములు శుక్రవారం పరామర్శించారు. దోసల చంద్రం తండ్రి దోసల శ్రీరాములు ఆకస్మికంగా మృతి చెందారు. సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి వేణు, నాయకులు ఉన్నారు.

దేశాన్ని మోసం చేస్తున్న చెన్నమనేని

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ ఏకంగా దేశాన్నే మోసం చేస్తున్నారని, తప్పుడు ధ్రువ పత్రాలు సమర్పించి నాలుగు సార్లు అడ్డంగా దొరికారని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెన్నమనేని రమేష్ మన దేశ పౌరుడు కాదని 15 సంవత్సరాల కింద తాను చెప్పిన మాటనే నేడు నిజమైందని అన్నారు. గత 15 సంవత్సరాల న్యాయపోరాటంలో తనకు అండగా నిలిచిన మిత్రులకు, శ్రేయోభిలాషులకు, నియోజకవర్గ ప్రజలకు, నాటి సీఎం రాజశేఖర్ రెడ్డి, నేటి సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రులు రత్నాకర్‌రావు, జీవన్ రెడ్డితోపాటు కేంద్ర మంత్రులకు, కాంగ్రెస్ మిత్ర బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు తెలిసినంతవరకు ప్రపంచ చరిత్రలోనే ఇలాంటి కేసు నమోదు కాలేదని, రమేష్ బాబుది లా మేకర్ చరిత్ర కాదని, లా బ్రేకర్ చరిత్ర అని అభివర్ణించారు. ఇంత జరిగినా 'తీర్పు హేతుబద్ధంగా లేదు. ఈ తీర్పు నిరాశపరిచింది. నేను ముమ్మాటికి భారతదేశ పౌరుడి' అని రమేష్ బాబు వాదించడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇప్పటికి 45 సార్లు రమేష్ బాబు జర్మనీ పాస్‌పోర్ట్‌పై ఆ దేశానికి వెళ్లి వచ్చారని, ఆయన మోసం చేస్తున్నది జర్మనీ దేశాన్ని కాదని భారతదేశాన్ని అని ప్రతీ ఒక్కరు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. రమేష్ బాబు జర్మనీని ప్రేమిస్తూ భారతదేశాన్ని, నియోజకవర్గ ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. చెన్నమనేని రమేష్ 2013 నుంచి ఓసీఐ కార్డు కలిగి ఉన్న మాట నిజం కాదా? అని ప్రశ్నించారు. ఓసీఐ కార్డు ఉన్న వ్యక్తి భారతదేశంలో ఓటు వేయడానికి అనర్హుడని, తన పరపతి ఉపయోగించి ఓటర్ లిస్టులో పేరు ఎక్కించుకున్నారని ఆరోపించారు. పౌరసత్వ విషయంలో రమేష్ బాబు తన ప్రవర్తనతో ఆయన వంశానికి తల్లిదండ్రులకు చెడ్డ పేరు తీసుకువచ్చారని అన్నారు. రమేష్ బాబు చేసింది తప్పని త్రీమెన్ కమిటీ కూడా నిర్ధారించిందని, రమేష్ బాబు జర్మనీ పౌరుడేనని కేంద్ర హోంశాఖ మూడు సార్లు చెప్పిందని అన్నారు. 2009లో తాను కేవలం 1800 ఓట్ల తేడాతో ఓడిపోయానని, తాను ఆనాడే గెలిచి ఉంటే ఈరోజు పరిస్థితి ఎలా ఉండేదో నియోజకవర్గ ప్రజలు ఆలోచన చేయాలని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన ఈసారి తాను గెలుపొందిన అనంతరం ఇప్పటికే రూ.750 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టానని అన్నారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, గత పదిహేనేళ్లుగా రమేష్ బాబుపై తాను న్యాయపరంగా పోరాటం చేశానే తప్పితే ఏనాడు వ్యక్తిగతంగా విమర్శలు చేయలేదని, కానీ రమేష్ బాబుతోపాటు ఆయన అనుచరులు తనను ఎన్నో ఇబ్బందులు పెట్టారని, కేసుల్లో ఇరికించే ప్రయత్నం చేశారని, అయినప్పటికీ ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని నిలబడ్డానని ఆది శ్రీనివాస్ అన్నారు. ఎవరు ఎన్ని చేసినా చివరకు న్యాయమే గెలిచిందని, భారత న్యాయ వ్యవస్థలో ఈ తీర్పు ఒక చక్కటి వేదికగా నిలిచిందని అన్నారు. హైకోర్టు తీర్పు విషయంలో తప్పయ్యిందని క్షమించమని అడగాల్సింది పోయి కోర్టు తీర్పుపై నిరాశ చెందినట్లు ప్రకటన చేయడం సబబు కాదని, ఇప్పటికైనా ఇలాంటి అర్థంపర్థం లేని మాటలు మానుకోవాలని హితవు పలికారు. 15 సంవత్సరాలుగా కోర్టులను, భారతదేశాన్ని మోసం చేసినందుకు హైకోర్టు రూ.30 లక్షల జరిమానా విధించిందని, ప్రపంచంలో ఇలాంటి కేసు ఎక్కడా ఉండకపోవచ్చని అన్నారు. గత 15 ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో అండగా నిలిచిన వారందరికీ ఆది శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే సమాజంలో గుర్తింపు

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో పనిచేస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎంఈవో రఘుపతి అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ మండల పరిషత్ పాఠశాలలో 12 సంవత్సరాలుగా పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉత్తం విజయ్‌కుమార్ ఉపాధ్యాయుడిని శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన పాఠశాలలో కూడా పనిచేసి గుర్తింపు తెచ్చుకో వాలన్నారు. ప్రధానోపాధ్యాయిని చక్రవర్తుల రమాదేవి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ సుధ, కౌన్సిలర్ సత్యనారాయణ, పాఠశాల విద్యాకమిటీ మాజీ చైర్మన్ జీవన్ పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌కు తరలాలి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఈ నెల 17 చేపట్టనున్న చలో హైదరాబాద్‌కు తరలిరావాలని సీఐటీయూ గ్రామపంచాయతీ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్యాల నర్సయ్య, అన్నల్‌దాస్ గణేష్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. అనంతరంయ ఆయన మాట్లాడుతూ జీవో 51ని సవరించాలన్నారు.

మున్సిపల్ రీసోర్స్ పర్సన్ల ముందస్తు అరెస్టు



సంఘీభావం తెలుపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, బీఆర్ఎస్ నాయకులు

వేములవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న మున్సిపల్ రిసోర్స్ పర్సన్లను వేములవాడ పట్టణ పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని మున్సిపల్ ఆర్పీలు హైదరాబాద్‌లో ఆందోళన నిర్వహించడానికి సిద్ధమయ్యారు. ఆర్పీలు హైదరాబాద్ తరలి వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, బీఆర్ఎస్ నాయకులు పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాధవి మాట్లాడుతూ అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ పాలనను అమలు చేస్తోందని మండిపడ్డారు. మహిళలని చూడకుండా ఆర్పీలను వేకువ జామునే పోలీస్ స్టేషన్‌ను తీసుకురావడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. అంతకుముందు ఆర్పీలు మాట్లాడుతూ వేతనాన్ని నెలకు రూ.18 వేలకు పెంచుతామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, ప్రస్తుతం ఉన్న 6 వేల రూపాయల వేతనాన్ని కూడా ఏడు మాసాలుగా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేములవాడ ఆర్పీల సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి, ఆర్పీలు భూదేవి, హింగే నీతూ కుమారి, ఉమా, శాంత, జ్యోతి, మహేశ్వరి, పద్మతోపాటు మరో 15 మందిని పోలీసులు అదుపులోకి తీసుకొని వ్యక్తిగత పూచీకత్తు మీద విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు మారం కుమార్, నిమ్మశెట్టి విజయ్, జోగిని శంకర్, గోలి మహేశ్, బీఆర్ఎస్ నాయకులు ముద్రకోల వెంకటేశం, వాసాల శ్రీనివాస్, రాజు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2కు పకడ్బందీ ఏర్పాట్లు

5వ పేజీ తరువాయి

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, గీతానగర్ జడ్పీ ఉన్నత పాఠశాల, పత్తిపాక వీధిలో సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, విద్యానగర్‌లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్, భావనారుషి నగర్‌లో శ్రీచైతన్య స్కూల్, విద్యానగర్‌లో నారాయణ హైస్కూల్, శివనగర్‌లో కుసుమరామయ్య జడ్పీ ఉన్నత పాఠశాల, అంబేద్కర్‌నగర్ జడ్పీ ఉన్నత పాఠశాల, వెంకంపేట జడ్పీ ఉన్నత పాఠశాల, సర్ధార్‌నగర్‌లో శ్రీ శివాని డిగ్రీ కళాశాల, పాత బస్టాండ్ సమీపంలో శ్రీ సాయి జూనియర్ కళాశాల, అనంతనగర్‌లో అయ్యప్ప డిగ్రీ కళాశాల, కరీంనగర్ రోడ్డులో వికాస్ డిగ్రీ కళాశాల, నెహ్రూనగర్‌లో జడ్పీ ఉన్నత పాఠశాల, వాసవినగర్‌లో మహతి డిగ్రీ కళాశాల, పాతబస్టాండ్ సమీపంలో ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్, మెహెర్‌నగర్‌లో శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్, వేములవాడ మండలం అగ్రహారంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వేములవాడ మల్లారం రోడ్‌లో ధార్మిక డిగ్రీ కళాశాల, వేములవాడ కోరుట్ల రోడ్డులో వైష్ణవి డిగ్రీ కళాశాల, గౌతమ్ మోడల్ స్కూల్, మార్కెట్ కమిటీ ఎదురుగా వాగ్దేవి డిగ్రీ కళాశాల, మల్లారం రోడ్‌లో వివేకానంద జూనియర్ కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు.

జిల్లాలో గ్రూప్-2 పరీక్ష నిర్వహణలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనలు కట్టుదిట్టంగా అమలు చేయడానికి యంత్రాంగం సిద్ధమైంది. పరీక్ష నిర్వహణలో ఉండే సిబ్బంది తప్పనిసరిగా గుర్తింపు కార్డు ధరించాలి. అభ్యర్థులు చెప్పులతో రావాలి. ఎలక్ట్రానిక్ పరికరాలు ఆభరణాలను కేంద్రంలోకి అనుమతించరు. అభ్యర్థులు వెంట హాల్‌టికెట్, పెన్నుమాత్రమే తెచ్చుకోవాలి. పరీక్ష కేంద్రాల్లో మొబైల్ ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు భద్రపర్చుకోవడానికి లాకర్‌రూం ఉండదు. హాల్‌టికెట్‌లోని ప్రతీ సూచనను పాటించాలి. అభ్యర్థులను తనిఖీలు చేయడానికి వేర్వేరుగా ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులు రూం నంబరు, కేటాయించిన సీటు వద్దకు చేరుకొని ప్రశ్నాపత్రం కోడ్‌ను పరీక్షించుకోవాలి. కేంద్రాల దగ్గర చుట్టుపక్కల పోలీసులు సూచించిన పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు పార్క్ చేయాలి.

పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలు

జిల్లాలో గ్రూప్-2 పరీక్ష కేంద్రాల వద్ద 144 (బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163) సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్ష కేంద్రానికి 50 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు మూసి వేయనున్నారు. చుట్టుపక్కల లౌడ్ స్పీకర్‌లపై నిషేధం విధించారు.

మండల కేంద్రాల నుంచి ప్రత్యేక బస్సులు

పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్ష సమయానికి అభ్యర్థులు చేరుకునే విధంగా సిరిసిల్ల, వేములవాడ ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడపడానికి ఏర్పాట్లు చేశారు. ఉదయం 8.30 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకునే వీలుగా సాయంత్రం 5.30 గంటల తరువాత తిరిగి వెళ్లే విధంగా మండల కేంద్రాల నుంచి రవాణా సౌకర్యం కల్పించారు.

గ్రూప్ - 2 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

జిల్లాలో గ్రూప్-2 పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం. అభ్యర్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. టీజీపీఎస్సీ నిబంధనలు కచ్చితంగా పాటించాలి. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశాం. అభ్యర్థి ఇన్విజిలేటర్ సమక్షంలో హాల్‌టికెట్‌పై సంతకం పెట్టాలి. పరీక్ష ముగిసే వరకు అభ్యర్థులు పరీక్ష హాల్లోనే ఉండాలి.

ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిని నియమించాలి



డీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల సస్పెండ్ చేసిన ఆంగ్ల ఉపాధ్యాయుడి స్థానంలో నూతన ఉపాధ్యాయుడిని నియమించాలని పలువురు నాయకులు కోరారు. జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్‌రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. పాఠశాలలో విద్యార్థులు నష్టపోకుండా ఆంగ్ల ఉపాధ్యాయుడి పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. నాయకులు స్వామి, రంజిత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శివాలయంలో శుక్రవారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం వేద పఠనం, గణపతి పూజ, అంకురార్పణం, అగ్ని ప్రతిష్ఠ, జలాధివాసం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధల నడుమ పూజలు చేశారు. ఈ నెల 15న ధ్వజ స్తంభ, యంత్ర, శిఖర ప్రతిష్ఠ, పూర్ణాహుతి, కుంబాభిషేకం, శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం గోరంటాలలో పలు అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడారు. గోరంటాలో గత నెల 30న రూ.65 లక్షల నిధులతో పలు ప్రగతి పనుల శిలాఫలకాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆవిష్కరించారన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేని కొందరు ఇలాంటి ఘటనలకు ఒడిగడుతున్నారన్నారు. గతంలోనూ మండలంలోని రాజన్నపేటలో ప్రజా ప్రాంగణం శిలాఫలకాన్ని ధ్వంసం చేశారన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర మహాసభలకు తరలిరావాలి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి సంఘం 43వ రాష్ట్ర మహాసభలకు విద్యార్థులు తరలిరావాలని ఏబీవీపీ రాష్ట్రహాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో మహాసభలు ఉంటాయని పేర్కొన్నారు. ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజురావు, నాయకులు సునీల్, కార్తీక్, వంశీ, హరీష్, పవన్, రాహుల్ , నవీన్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

17న ఎమ్మార్పీఎస్ జిల్లా స్థాయి సమావేశం

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈ నెల 17న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్, అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ ఖానాపురం లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు చెప్పారు. అనంతరం జిల్లాలో నూతన కమిటీల నిర్మాణంలో భాగంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్లుగా సావనపల్లి రాకేష్(ఇల్లంతకుంట), దొబ్బల ఆనంద్(చందుర్తి)నియమించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి, రాష్ట్ర నాయకుడు పాల్గొన్నారు.

సూరమ్మ చెరువు కాలువ భూసేకరణ సభ

కథలాపూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబారిపేటలో శుక్రవారం సూరమ్మ చెరువుకు సంబంధించిన ఎడమ కాలువ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో కోరుట్ల ఆర్డీవో జికేందర్‌రెడ్డి గ్రామ సభ ఏర్పాటు చేశారు. సుమారు 73 ఎకరాల భూములు కోల్పోతున్నందున రైతులు తమకు గిట్టుబాటు ధరలు అందేలా చూడాలని విన్నవించారు. భూముల కోల్పోతున్న రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు లేకపోవడంతో తప్పులు సవరించాలని కోరుతూ 12 మంది రైతులు దరఖాస్తు సమర్పించుకున్నారు. తహసీల్దార్ నవీన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఐ నగేశ్ ఉన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు



సర్వే చేస్తున్న ఈవో రమేశ్

ముస్తాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అర్హులకు దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేయనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హుల కోసం సర్వే చేశారు. ప్రజాపాలనలో భాగంగా ముస్తాబాద్‌లో 1680 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, అర్హుల ఎంపిక కోసం అధికారులు ఇంటింటా సర్వే చేస్తున్నారని తెలిపారు. పట్టణ అధ్యక్షులు గజ్జెల రాజు, ఈవో రమేశ్, నాయకులు ఉచ్చిడి బాల్‌రెడ్డి,రంజాన్ నరేశ్, మిరుదొడ్డి భాను, దీటి నర్సింలు, శీల ప్రశాంత్, మిరుదొడ్డి భాను, బుచ్చయ్య, మహేందర్‌రెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

మాజీ మంత్రుల అరెస్టు సిగ్గుచేటు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాండూరు ఎస్సీ హాస్టల్ సందర్శనకు వెళ్తున్న మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్‌ను పోలీసులు అరెస్టు చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించడానికి వెళ్తున్న మాజీ మంత్రులు, బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయించడాన్ని ఖండించారు. గురుకులాలు, హాస్టల్స్‌లో నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ సమావేశంలో మట్టె శ్రీనివాస్, అనిల్‌గౌడ్, నవీన్‌కుమార్, వెంకటేష్, శ్రీకాంత్, అక్రమ్, అస్లాం, వినయ్‌లు పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని పాలకవర్గం

చందుర్తి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రైతులను పీఏసీఎస్ పాలకవర్గం పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ మండల నాయకులు పులి సత్యం అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ యాసంగి సీజన్ దాదాపు సగం వరకు వరి నాట్లు వేశారని, ఇప్పటివరకు ఎరువుల బస్తాలను సంఘానికి సరఫరా చేయించలేదని అన్నారు. గతంలో ఎరువుల బస్తాలపై 40 రూపాయలు అదనంగా తీసుకున్నారని వాటిని సంఘానికి జమ చేసి వెంటనే రైతులకు ఎరువు బస్తాలు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు.

వసతి గృహాల తనిఖీ

ధర్మపురి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని ఎస్సీ బాలుర, బీసీ బాలుర వసతి గృహాలు, కేజీబీవీ పాఠశాలను మున్సిపల్ కమిషనర్ కందుకూరి శ్రీనివాస్ శుక్రవారం తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఆయన వసతి గృహాల్లో భోజనశాలను, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా? అంటూ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పరిసర ప్రాంతాలను పారిశుధ్య కార్మికులు శుభ్రం చేయించి, మురికి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. ప్రజా పాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పర్యవేక్షించారు. సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లకు పలు సలహాలు, సూచనలు అందించారు. మేనేజర్ బాలె గంగాధర్, సానిటీరీ ఇన్‌స్పెక్టర్ చిట్యాల గంగాధర్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో చైతన్య యూత్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 36వ ఉమ్మడి జిల్లా స్థాయి గ్రామీణ కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మన ప్రాంతంలో కబడ్డీ, వాలీబాల్ అంటే నూకలమర్రి సనుగుల రుద్రంగి గ్రామాలు గుర్తొస్తాయన్నారు. క్రీడల్లో రాణిస్తే జీవితంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైన దృఢంగా ఉంటారన్నారు. క్రీడలు శారీరక దారుఢ్యానికి దోహదపడుతాయన్నారు. స్నేహ పూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నారని, రానున్న ఒలింపిక్స్ పాల్గొనడానికి రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభించారని అన్నారు. సీఎం కప్ ద్వారా క్రీడాకారులను వెలికితీసి వారికి ప్రోత్సాహం అందించనున్నట్లు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అందరూ పాల్గొనే వేదికలుగా క్రీడా పోటీలు నిలుస్తాయని తెలిపారు. రానున్న రోజుల్లో జాతీయ స్థాయిలో కబడ్డీ పోటీలకు సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, బీజేపీ నాయకులు వికాస్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, డైరెక్టర్ పాలకుర్తి పర్శరాములు, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సంపత్ రావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ముస్కు మల్లారెడ్డి, బొడ్డు రాములు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

చందుర్తి డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని సహకార పరపతి సంఘం ఎదుట రుణమాఫీ కానీ రైతులతో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఆరు గ్యారెంటీల పేర్లతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను అమలు చేయడంలో తెలంగాణ ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. రైతు రుణమాఫీ చేశామని కాంగ్రెస్ నాయకులు చెప్పుకుంటున్నారని, పూర్తిస్థాయిలో అమలు కాలేదని అన్నారు. చాలామంది రైతులు రెండు లక్షల రుణమాఫీ అవుతుందని ఆశపడి మిగతా డబ్బులను అప్పులు తెచ్చి బ్యాంకులో జమ చేసినా ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. తక్షణమే రైతులకు రుణమాఫీ చేయాలని, లేని పక్షంలో రైతులతో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మర్రి రాములు, సిరికొండ మల్లయ్య, రవీందర్ రెడ్డి, సిసింద్రీ, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మికులు

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ కొత్త లేబర్ కార్డులను అందించాలని, పెండింగ్ ఫైల్స్‌లను క్లియర్ చేయాలని అన్నారు. అర్హులైన కార్మికులకు ఉపాధి చూపాలని, 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు ప్రతీ నెల రూ.5 వేల పింఛన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రద్దు చేసిన లేబర్ కార్డులను పునరుద్ధరించాలన్నారు. జిల్లాలో ఏసీఎల్, డీసీఎల్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల పోశెట్టి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జవేణు, దుంద్రపెల్లి రవీందర్, శ్రీరాముల నర్సయ్య, పం డుగ పోచమల్లు, పెంటమల్లయ్య, గాజుల మల్లయ్య, గంగలక్ష్మీ, రాజాం శ్రావన్‌పలి మల్లేశం, శేఖర్, జనగాం లక్ష్మణ్, లక్ష్మీకాంత్, మామిడాల నర్సయ్య, మల్లారపు రాజు, బాబు తదితరులు పాల్గొన్నారు.